epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 01 | సంచిక : 28 | శనివారం | 11.05.2024


## ఝూటా.. కాంగ్రెస్‌ను నమ్మి

# మోసపోవద్దు

- ఎంపీ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి
- క్యామను భారీ మెజార్టీతో గెలిపించాలి
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీని నమ్మితే మళ్లీ మోసపోతామని ఈ ఎంపీ ఎన్నికల్లో ఓటుతో గట్టిగా బుద్ధి చెప్పాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం గెలుపు కోసం జనగామ ఆర్ అండ్ బీ గెస్ట్ హౌజ్ నుంచి ఆర్టీసీ చౌరస్తా వరకు భారీ రోడ్ షో నిర్వహించారు.

3





## మంద కృష్ణా..

## నీ తీరు మార్చుకో..!

2

- దండోరా రాష్ట్ర అధ్యక్షుడు పాపయ్య



## పోలింగ్ ఏర్పాట్లు

## పక్కాగా ఉండాలె..

2

- రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాలు



## ఆ మూడు రోజులు

## వైన్స్ షాపులు బంద్

2

- ఎక్సైజ్ శాఖకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు

## బీజేపీతోనే

## దేశాభివృద్ధి

- వరంగల్ అభ్యర్థి అరూరి



3



## కాంగ్రెస్‌ను గెలిపించండి : కడియం

General News

# పోలింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలె

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్
- కట్టుదిట్టమైన భద్రతలో ఈవీఎంల తరలింపు
- జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



**జనగామ, మన చౌరాస్తా :** లోక్ సభ ఎన్నికల పోలింగ్ పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులు లోక్ సభ సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ గడువు శుక్రవారంతో ముగిసినందున పార్లమెంటు నియోజకవర్గం పోస్టల్ బ్యాలెట్లను ఎక్స్ చెంజ్ చేసుకొని, మే 12 నాటికి ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి నుంచి జారీ చేసిన పోస్టల్ బ్యాలెట్, నమోదైన పోస్టల్ బ్యాలెట్ ఓట్ల వివరాల రిపోర్ట్ అందజేయాలని, పోస్టల్ ఓట్ల నమోదు సంబంధిత సమాచారం వివిధ రాజకీయ పక్షాలకు తెలియజేయాలని, పోస్టల్ బ్యాలెట్లను పార్లమెంటు నియోజకవర్గం కౌంటింగ్ కేంద్రాల స్ట్రాంగ్ రూములకు కట్టుదిట్టంగా తరలించి భద్రపర్చాలన్నారు. ఎన్నికల పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల ముందు నుండి సైలెన్స్ పీరియడ్ ప్రారంభమవుతుందని, సైలెన్స్ పీరియడ్ లో పాటించాల్సిన నిబంధనలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు, అభ్యర్థులకు సమాచారం అందించాలని, ఇతర ప్రాంతాల నుంచి ప్రచారానికి వచ్చిన స్థానికేతరులు వెళ్లేలా చూడాలని అన్నారు. పోలింగ్ రోజు, పోలింగ్ ముందు రోజు వార్త పత్రికలలో జారీ చేసే ప్రకటనలకు తప్పని సరిగా జిల్లా ఎంసీఎంసీ కమిటీ ఆమోదం తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రచార సమయం ముగిసిన తరువాత ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా కట్టుదిట్టమైన నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని, డబ్బు, మద్యం పంపిణీ కాకుండా చూడాలని, వాటిపై సీ విజల్, 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. పోలింగ్ సమయం సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లాలలో తనిఖీలు ముమ్మరం చేయాలని, ముఖ్యమైన కూడలీలలో, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాలలో నిఘా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పోలింగ్ కేంద్రాలు, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాల వద్ద పోలింగ్ సిబ్బందికి అవసరమైన వసతులు కల్పించాలని, పోలింగ్ బృందాలకు పోలింగ్ సామాగ్రి అందజేసి వాహనాల ద్వారా పోలింగ్ కేంద్రాలకు మే 12 సాయంత్రం నాటికి చేరుకోవాలని అన్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో మహిళా, దివ్యాంగుల, మోడల్, యూత్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మే 13న ఉదయం మాక్ పోల్ నిర్వహించాలని, మాక్ పోల్ అనంతరం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కావాలని, ప్రతి 2 గంటలకు పోలింగ్ శాతం వివరాల నివేదికను సమర్పించాలని అన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల వెబ్ క్యాస్టింగ్, సిసి కేమేరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. సెక్టార్ అధికారులు రిజర్వ్ ఈవీఎం యంత్రాలతో సన్నద్ధంగా ఉండాలని, ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ సమయంలో ఈవీఎం యంత్రాలు మరమ్మతుకు గురైతే వెంటనే రీప్లేస్ చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత వ్యవస్థ ఉండాలని అన్నారు.

వీడియో సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ఎన్నికల కమీషన్ మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అవసరమైతే అదరపు సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. మన జిల్లాలో 869 పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్, 162 పోలింగ్ కేంద్రాల బయట సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారులు, ఆర్డీవోలు జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవోలు దేవరాయి కొమరయ్య , డి. ఎస్. వెంకన్న, కలెక్టరేట్ ఏవో రవీందర్, ఎన్నికల సెక్షన్ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# మంద కృష్ణా.. తీరు మార్చుకో!

## – దండోరా రాష్ట్ర అధ్యక్షుడు పాపయ్య

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** మాదిగలను మభ్య పెడుతున్న మంద కృష్ణ నీ పద్ధతి మార్చుకోవాలని ఎమ్మార్పీఎస్, దండోరా రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య అన్నారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు నాయకత్వం వహిస్తున్నానని రాజకీయ పార్టీల పంచన చేరుతున్న మందకృష్ణ ఇప్పుడు మోడీ సంకల చేరి బిజెపి జపం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. దేశంలోని ప్రధాన పార్టీల సహకారం లేనిదే వర్గీకరణ జరగదనే విషయం మందకృష్ణకు తెలిసే మాదిగలను మభ్యపెడుతున్నాడని ఆరోపించారు. గడిచిన పదేళ్ల బిజెపి పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రక్షణ లేదని అందుకు మణిపూర్ సంఘటననే నిదర్శనం అన్నారు. దళితులను ఓర్వలేని మత పిచ్చి ఉన్న బిజెపి మణిపూర్ లో దళిత మహిళలని వివస్త్రత చేసి, బహిరంగంగా చెరిచిన స్పందించని ప్రధాని మోదీకి మాదిగలు ఎందుకు ఓటేయాలని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగ పరిరక్షణకు, రిజర్వేషన్ల కొనసాగింపుకు, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీల రక్షణ కోసం కాంగ్రెస్ ను గెలిపించాలన్నారు. వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో ఉన్న కడియం కావ్యం భారీ మెజారిటీతో గెలిపించేందుకు ముందుకు రావాలని మందకృష్ణ మాయ మాటలకు మోసపోవద్దన్నారు. బ్రాహ్మణ వ్యక్తిని పెళ్లి చేసుకున్న సుగుణ కుమారి ఎస్సీ అయినప్పుడు ముస్లింను పెళ్లి చేసుకున్న కావ్య ఎస్సీ ఎందుకు కాదని ప్రశ్నించారు. మాదిగలను మభ్యపెడుతూ ఆర్థికంగా, రాజకీయంగా లబ్ధి పొందుతున్న మందకృష్ణ నీ విధానాలు మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి మోహన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలస్వామి, నీరటి ప్రభాకర్, పార్నంది రమేష్, కలకోట సురేందర్, రాజు, ఎడ్ల రవీందర్, మల్లేశం, మేడ స్వామి, సింగపురం యాదగిరి, రవి పాల్గొన్నారు.



# అంగన్‌వాడీకి ప్లేట్లు, ఫ్యాన్ వితరణ

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** జనగామ జిల్లా స్టేషన్ ఘన్ పూర్ మండల కేంద్రంలోని 6వ అంగన్‌వాడీ కేంద్రానికి దాతలు సీలింగ్ ఫ్యాన్, ప్లేట్లు, గ్లాసులు వితరణ చేశారు. శుక్రవారం అన్నప్రాసన దివస్ వేడుక సందర్భంగా స్థానిక ఆర్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు దారం రాజు, ఉపాధ్యక్షుడు కాసాని రమేష్ లు పది ప్లేట్లు, పది గ్లాసులు, గోనెల నాగరాజు సీలింగ్ ఫ్యాన్ ను అంగన్వాడి టీచర్ రాణి కి అందజేశారు. కార్యక్రమంలో కుమారస్వామి, విజయ, ఎల్లయ్య, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.




# ఉచిత మజ్జిగ పంపిణీ

**జనగామ, మన చౌరాస్తా :** పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద వాసవి క్లబ్, వనిత క్లబ్ గ్రేటర్ జనగామ ఆధ్వర్యంలో మజ్జిగ వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ వేసవిలో దాహార్తిని తీర్చేందుకు ఈ కార్యక్రమము చేపట్టామని తెలిపారు. మా క్లబ్బు విరివిగా సేవ కార్య క్రమాలు చేస్తామని అందులు భాగముగా ఈ రోజు చేశామని తెలుపడం జరిగింది, ఈ కార్యక్రమములో అధ్యక్షురాలు వరూధిని మాధం శెట్టి, పడకంటి రవీందర్, కార్యదర్శి గంగిశెట్టి అనుజ, కోశాధికారి పులిగిల్లా నాగమణి, కౌన్సిలర్ మహంకాళి హరిచందర్ గుప్తా, జోన్ ఛైర్మెన్ గట్టు వెంకటేశ్వర్లు, నంగునూరి లక్ష్మి నారాయణ, లక్ష్మి, పులిగిల్ల సోమరాజు, లగిషెట్టు వీర లింగం తదితరులు పాల్గొన్నారు.

# ఆ మూడు రోజులు వైన్స్ బంద్



**వరంగల్, మన చౌరాస్తా :** నేటి నుంచి మూడు రోజుల పాటు వైన్స్ బంద్ కానున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో ఎంపీ ఎన్నికలు ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఈ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ తాజాగా కీలక ఆదేశాలు జారీ చేసింది. మద్యం దుకాణాలను మూడు రోజుల పాటు మూసివేయాలని ఆదేశించింది. దీంతో ఇవాళ సాయంత్రం ఆరు గంటల నుంచి 13 సాయంత్రం వరకు మూతబడనున్నాయి వైన్ షాపులు. మే 12, మే13 రోజులను డ్రై డేగా ప్రకటించారు. మరోవైపు ఎన్నికల ఫలితాలు వెలువడే జూన్ 4న కూడా మద్యం దుకాణాలు బంద్ కానున్నాయి. దీంతో మందు బాబులు ముందస్తుగానే సర్దుకుంటున్నారు.

Local News



# కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు

- ఎంపీ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి
- క్యామను భారీ మెజార్టీతో గెలిపించాలి
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

**జనగామ, మన చౌరాస్తా :** కాంగ్రెస్ పార్టీని నమ్మితే మళ్లీ మోసపోతామని ఈ ఎంపీ ఎన్నికల్లో ఓటుతో గట్టిగా బుద్ధి చెప్పాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం గెలుపు కోసం జనగామ ఆర్ అండ్ బీ గెస్ట్ హౌజ్ నుంచి నుంచి ఆర్టీసీ చౌరస్తా వరకు భారీ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా జనగామ చౌరాస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో పల్లా మాట్లాడుతూ 'బస్సు ఫ్రీ, కల్యాణలక్ష్మీతో పాటు తులం బంగారం, రైతులకు రూ.15వేలు, ఆడబిడ్డలకు రూ.2,500, పింఛన్ రూ.4 వేలు, రూ.2లక్షల రుణమాఫీ, ధాన్యానికి రూ.500 బోనస్' అని మాయ మాటలు చెప్పి రేవంత్‌రెడ్డి ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అవన్నీ అమలయ్యాయా.. అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయలేని వారు ఏ మొఖం పెట్టుకొని మళ్లీ ఓట్లు అడుగుతున్నారో ఒకసారి ఆలోచించాలని ప్రజలకు సూచించారు. చేతకాని సీఎం పంద్రాగస్టు రుణమాఫీ చేస్తానని దేవుళ్ల మీద ఒట్లు పెడుతున్నాడని ఎద్దేవా చేశారు. రాహుల్‌గాంధీ కొత్త హామీలు ఇచ్చేముందు అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుకానందుకు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండే అనేటోళ్లు కారు గుర్తును మరిచిపోవద్దన్నారు. క్యామ మల్లేశంను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

### ఛీ కొట్టినా బుద్ధి రాలే...

కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని జనగామ ప్రజలు ఛీకొట్టినా ఆయనకు ఇంకా బుద్ధి రాలేదని పల్లా విమర్శించారు. కావాలనే దొంగఓట్లతో గెలిచాడని తనపై గోబెల్స్ ప్రచారం చేస్తున్నడని పేర్కొన్నారు. అప్పట్లో పొన్నాల లక్ష్మయ్యపై ఇదే రకమైన ప్రచారం చేశాడని గుర్తుచేశారు. నిత్యం జనగామ ప్రజలకు అందుబాటులో ఉంటూ తన సొంత దవాఖానలో ఇప్పటికే 6,500 మందికి ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్న తనపై అబద్ధపు ప్రచారం చేస్తున్నాడని మండిపడ్డారు. తాను ఎమ్మెల్యే కాకముందే జనగామ పట్టణానికి రూ.కోటి నిధులు తెచ్చానని, బీఆర్ఎస్ ప్రభుత్వం ఉండగానే మరో రూ.25 కోట్ల నిధుల జీవో తెచ్చిన.. తాను తెచ్చిన నిధులకు టెండర్ అయిందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీని గెలిపించండి

**ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**స్టేషన్ ఘన్ పూర్, మన చౌరస్తా:** నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాత్రి స్టేషన్ ఘన్ పూర్ లో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్ లో పిపిసి ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇంచార్జ్ సింగపురం ఇందిరతో కలిసి ఎమ్మెల్యే శ్రీహరి పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ సునామిలో బీఆర్ఎస్ పార్టీ కొట్టుకుయింది, నాపై విశ్వాసంతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మన బంగారం మంచిదైతే ఎక్కడైనా అమ్ముడుపోతుందని నాలుగు సార్లు గెలిచిన మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గాన్ని మంచోడు అయితే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేవాడు అన్నారు. కేసీఆర్ కుటుంబమంతా అవినీతికి పాల్పడ్డది. కల్వకుంట్ల కుటుంబం చేసిన అవినీతి, అక్రమాలు, ఫోన్ ట్యాపింగ్, భూ కబ్జాలు ఒక్కొక్కటి బయటకు రావడం కేసీఆర్ బిడ్డ లిక్కర్ స్కామ్ లో ఇరుక్కోవడం నాకు ఇబ్బంది కలిగించింది అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానం మేరకు, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చడానికే కాంగ్రెస్ పార్టీలో చేరాను అన్నారు. ఆగస్టు 15లోగ 2లక్షల రుణ మాఫీ, మహిళలకు 2 వేల 500 చేయూత అందిస్తామని సీఎం ఇచ్చిన హామీ నెరవేర్చుతారు అన్నారు. నాకు రాజకీయంగా అండగా నిలిచి కడుపులో పెట్టుకొని ఆదరిస్తున్న నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటా అన్నారు. నియోజకవర్గ ఇన్చార్జి సింగపురం ఇందిర మాట్లాడుతూ 7 వేల ఇం



దిరమ్మ ఇండ్లు వస్తాయని ప్రభుత్వ పథకాలు అమలు చేయాలన్న, మంజూరు ఇవ్వాలన్న మా ఇద్దరి సమన్వయం ఇందిరమ్మ కమిటీల ద్వారానే జరుగుతుంది అన్నారు. 10 ఏళ్ళు బీజేపీ పాలనలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, స్టీల్ ఫ్యాక్టరీ, ఒక్క ప్రాజెక్టు, మెడికల్ కాలేజి ఇవ్వని మీకు ఓటు ఎందుకు చేయాలని ప్రశ్నించారు. పేదల పొట్టగొట్టి అంబానీ, అదాని లాంటి కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెడుతున్న మోడీకి, భారతీయ జనతా పార్టీకి బుద్ధి చెప్పాలంటే 13న జరిగే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య ను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర, మండల పార్టీ అధ్యక్షుడు శిరీష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చింతకుంట్ల నరేందర్ రెడ్డి, కొలిపాక సతీష్, బూర్ల శంకర్, మేకల మల్లేశం, బెల్దే వెంకన్న, వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీతోనే దేశాభివృద్ధి

- బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్

**హనుమకొండ, మన చౌరాస్తా :** దేశం అభివృద్ధి చెందాలంటే బీజేపీతోనే సాధ్యమని వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌అన్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని వంగపహడ్, హసన్ పర్తి లలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ లో ఆయన పాల్గొని మాట్లాడారు. మీరు ఆశీర్వదిస్తే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు చేయాలని కొట్లాడుతా అన్నారు. వరంగల్ పార్లమెంట్ సమస్యలను పరిష్కరించుటకు కృషి చేస్తానని తెలిపారు. గత పది సంవత్సరాల మోడీ పాలనలో శాంతి నెలకొందని... మోడీ గారి ప్రభుత్వంలో నాలాంటి వాళ్ళు ఎంపి గా ఉంటే మీ సమస్యలు అన్నీ తీరుతాయని హామీ ఇచ్చారు. పేద వర్గాల సమస్యలు తెలిసిన వాడిని.. కేంద్రంలో కూడా పేదరికం నుండి వచ్చిన బీసీ బిడ్డ ప్రధాన మంత్రిగా ఉన్నారు. మీ సమస్యలు పరిష్కారం చూపించగలగే సత్తా ఉన్న పార్టీ బిజెపి మాత్రమేనని నొక్కి చెప్పారు. కులంతో, మతంతో పార్టీలతో సంబంధం లేకుండా ప్రజలు తనను ఆదరిస్తున్నారని .. అదే కాంగ్రెస్, బిఆర్ఎస్ అభ్యర్థులు ఇక్కడ ప్రజలకు పెద్దగా తెలియదని వివరించారు. కాంగ్రెస్ నుండి వచ్చే వ్యక్తి కడియం శ్రీహరి బొమ్మ పెట్టుకొని ఓట్లు అడగడానికి వస్తుందని.. కడియం శ్రీహరినే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు.. ఆయన కూతురు ని ఎలా నమ్ముతారని ఎద్దేవా చేశారు. కడియం కావ్య ను సొంత పార్టీ ఎమ్మెల్యేలే వారి మనిషి గా అంగీకరించడం లేదు... ఎందుకంటే మళ్లీ ఎప్పుడు పార్టీకి వెన్నుపోటు పొడిచి వెళ్తారనే భయం ఉందన్నారు. తన వ్యక్తిత్వం దెబ్బతిసే విధంగా మాట్లాడే కడియం శ్రీహరి కి పుట్టగతులు ఉండవని.. ఈ ఎన్నికల్లో కడియం శ్రీహరి చరిత్ర కంచికే అన్నారు. ఇన్ని రోజులు ప్రజలను ప్రలోభాలకు గురి చేసి గద్దె మీద కూర్చున్నావ్.. ఇప్పుడు అదే ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టడం కోసం సిద్దంగా ఉన్నారని అన్నారు.

# డిస్ట్రిబ్యూషన్ , రిసెప్షన్ సెంటర్ల పరిశీలన



**హనుమకొండ, మన చౌరాస్తా :** లోక్ సభ ఎన్నికల దృష్ట్యా 15వరంగల్ పార్లమెంట్ పరిధి లోని 106 వరంగల్ (తూర్పు) అసంబ్లీ సెగ్మెంట్ కు సంబంధించి ఏనుమాముల మార్కెట్ యార్డ్ లోని గోడౌన్ నెం. 11 వద్ద డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ సెంటర్ లు ఏర్పాటు చేస్తున్న నేపద్యం లో కొనసాగుతున్న పనులను ఏ ఆర్ ఓ/బల్దియా కమీషనర్ అశ్విని తానాజీ వాకడే శుక్రవారం క్షేత్ర స్థాయి లో పరిశీలించి సమర్థవంతంగా ఏర్పాటు చేయుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఎన్నికల అనంతరం జూన్ 4న కౌంటింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో గోడౌన్ నెం 17 బి వద్ద కౌంటింగ్ కేంద్రాన్ని ఏ ఆర్ ఓ పరిశీలించి ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు సి సి కెమెరాల,బందోబస్తు లైటింగ్ తదితర ఏర్పాట్ల గురించి అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లు ఇక్బాల్ నాగేశ్వర్ రావు విజయ సారథి ఆర్ ఐ లు జలపతి రెడ్డి సంకీర్తన్ తదితరులు పాల్గొన్నారు.

**WANTED** **విలేకరులు కావలెను**



www.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way



**'మన చౌరాస్తా' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'మన చౌరాస్తా' సాదర స్వాగతం పలుకుతోంది.**

**సెల్ : 9676400812**


# సాయి, గిల్ సెంచరీల మోత..

**చెన్నైపై గుజరాత్ విక్టరీ**

- సొంతగడ్డపై రెచ్చిపోయిన గుజరాత్
- వాయువేగంతో సాయి, గిల్ సెంచరీలు



**మన చౌరాస్తా, క్రీడా విభాగం :**

తమ సొంతగడ్డ అహ్మదాబాద్ లో గుజరాత్ టైటాన్స్ రెచ్చిపోయారు. ఐపీఎల్ 2024 లో భాగాయంగా శుక్రవారం చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్ లో టైటాన్స్ ఓపెనర్లు కెప్టెన్ శుభ్ మాన్ గిల్, సాయి సుదర్శన్ వీర విహారం చేస్తూ చెలరేగిపోయారు. చెన్నై బౌలర్లను ఊచకోత కోస్తూ ఇద్దరూ సెంచరీల మోత మోగించారు. దీంతో చెన్నైపై గుజరాత్ 35 పరుగుల తేడాతో విక్టరీ సాధించింది. టాస్ గెలిచిన చెన్నై సూపర్ కింగ్స్ బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ కి దిగిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 231 పరుగులు చేసింది. గుజరాత్ టైటాన్స్ ఓపెనర్లు కెప్టెన్ శుభ్ మాన్ గిల్, సాయి సుదర్శన్ సుడిగాలి ఇన్నింగ్స్ తో చెలరేగిపోయారు. సాయి సుదర్శన్ 51 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్సులతో 103 పరుగులు చేయగా... గిల్ 55 బంతుల్లో 9 ఫోర్లు, 6 సిక్సులతో 104 పరుగులు చేశాడు. అయితే, గిల్, సాయి సుదర్శన్ జోడీ చివర్లో నిదానించడంతో స్కోరు కూడా మందగించింది. ఆఖర్లో వచ్చిన డేవిడ్ మిల్లర్ (11 నాటౌట్), షారుఖ్ ఖాన్ (2) పెద్దగా ఆకట్టుకోలేకపోయారు. చెన్నై బౌలర్లలో తుషార్ దేశ్ పాండే 2 వికెట్ల తీశాడు.

అనంతరం 232 పరుగుల లక్ష్య ఛేదనలో బ్యాటింగ్ కి దిగిన చెన్నై చతికిలపడింది. నిర్ణీత 20 ఓవర్లలో 196 పరుగులే చేసి చేతులెత్తేసింది. చెన్నై బ్యాటర్లలో డారిల్ మిచెల్, మొయిన్ అలీ అర్ధ సెంచరీలతో రాణించారు. చెన్నైకి తొలి ఓవర్‌లోనే షాక్ తగిలింది. ఉమేశ్ యాదవ్ వేసిన ఆరో బంతికి పరుగు తీసే క్రమంలో రచిన్ రవీంద్ర రనౌట్ అయ్యాడు. సందీప్ వారియర్ వేసిన రెండో ఓవర్ తొలి బంతికి తెవాతియాకి క్యాచ్ ఇచ్చి రహానె ఔటయ్యాడు. తర్వాతి ఓవర్లో ఉమేశ్ యాదవ్ బౌలింగ్‌లో ఫామ్ లో ఉన్న కెప్టెన్ గైక్వాడ్ రషీద్ ఖాన్ కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దీంతో 10 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయి చెన్నై పీకల్లోతు కష్టాల్లో పడింది. అనంతరం క్రీజులోకి వచ్చిన డారిల్ మిచెల్, మొయిన్ అలీ ఇన్నింగ్స్ ను నిర్మించారు. వీరిద్దరూ కలిసి ఇన్నింగ్స్ కు చక్కదిద్దే ప్రయత్నం చేసి గెలుపు ఆశలు కలిగించారు. కానీ మిచెల్, అలీ భాగస్వామ్యాన్ని మోహిత్ శర్మ విడదీశాడు. దీంతో మళ్లీ చెన్నై ఆశలు అడుగంటాయి. తర్వాత వచ్చిన టాపార్డర్స్ ఎవరు రాణించలేదు. చివర్లో ఎంఎస్ ధోనీ 11 బంతుల్లో 3 సిక్సులు, ఒక ఫోర్ తో 26 పరుగులతో విజృంభించినప్పటికీ లక్ష్యం భారీగా ఉండడంతో చెన్నై ఓటమి పాలైంది. గుజరాత్ బౌలర్లలో మోహిత్ శర్మ సూపర్ బౌలింగ్ తో చెన్నై పతనాన్ని శాసించాడు. గుజరాత్ బౌలర్లలో మోహిత్ శర్మ సూపర్ బౌలింగ్ తో చెన్నై పతనాన్ని శాసించాడు. ఆ జట్టు బ్యాటర్లు చెలరేగుతున్న కీలక సమయంలో 3 వికెట్లు తీసి కోలుకోకుండా చేశాడు. దీంతో గుజరాత్ కు విజయం దక్కింది. ఈ విజయంతో గుజరాత్ ప్లే ఆఫ్ ఆశలు సజీవంగా మిగిలాయి. ప్లే ఆఫ్ ఆశలు నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్ లో గుజరాత్ అద్భుత విజయం సాధించింది.